ఒక్కరోజు దాటినా రాయితీ హుష్‌కాకే!

- సకాలంలో చెల్లిస్తేనే వడ్డీ రాయితీ
- పంట రుణాల చెల్లింపులో రైతుల అవగాహన లేమి
- ఏడాదికి ఒక్కరోజు దాటినా వడ్డీ భరించాల్సిందేనంటున్న బ్యాంకర్లు


రామాపురం బ్యాంకులో రెన్యూవల్ కోసం వేచి ఉన్న రైతులు

బత్తలపల్లి: వ్యవసాయ రుణాల చెల్లింపులో రైతులకు సరైన అవగాహన లేక వడ్డీ రాయితీని పొందలేకపోతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో ప్రచారం లేకపోవడంతో అన్నదాతలు భారీగా ప్రభుత్వ లబ్ధిని కోల్పోతున్నారు. దీంతో పాటు వడ్డీ కూడా చెల్లించాల్సి వస్తోంది. సాధారణంగా మే నుంచి ఆగస్టు నెలఖారు వరకు ఖరీఫ్ సీజన్‌లో రైతులు బ్యాంకుల్లో ఉన్న పాత పంట రుణాలు చెల్లించి, కొత్త రుణాలు తీసుకుంటారు. నిబంధనల ప్రకారం ఖాతా పుస్తకంలో రుణం తీసుకున్న తారీఖు ప్రాతిపదికన ఏడాదిలోపు చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వడ్డీ రాయితీ పొందే అవకాశం ఉంటుంది.

వడ్డీ వసూలిలా..

పంట రుణాలకు బ్యాంకులు సాధారణంగా ఏడాదికి 7 శాతం వడ్డీ వసూలు చేస్తాయి. ఏడాది దాటితే 13.5 శాతం పెరిగిపోవడమే కాకుండా వడ్డీ రాయితీ వర్తించదు. ఏడాదిలోపు చెల్లించే రైతులకు రూ.లక్ష వరకు కేంద్ర ప్రభుత్వం 3 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం రాయితీ వారి ఖాతాల్లో జమ చేస్తుంది. అంటే వడ్డీ పూర్తిగా మాఫీ అవుతుంది. ఇందుకోసం రైతులు బీమా చేయించుకుంటే సరిపోతుంది. ఇక బంగారు ఆభరణాలపై రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులు 9 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయి.

పరిస్థితి ఇలా..

ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో ఏటా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 70 వేల హెక్టార్లలో వేరుశనగ, ఆముదం, కంది తదితర పంటలు సాగు చేస్తుంటారు. కొన్నేళ్లుగా వరుస కరువులతో రైతులు ఆర్థికంగా చితికిపోయారు. రుణమాఫీ కూడా సరిగా కాక అల్లాడిపోతున్నారు. దీంతో రుణాలు చెల్లించేందుకు డబ్బులు లేక సకాలంలో రెన్యూవల్ చేయలేక రాయితీని కోల్పోవాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వమే సకాలంలో రెన్యూవల్ చేయాలని రైతులు కోరుతున్నారు. అయితే తీసుకున్న రుణాలు ఏడాదిలోపు చెల్లిస్తేనే వడ్డీ రాయితీ వర్తిస్తుందని ఒక్క రోజు దాటినా వడ్డీ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో పంట రుణాల రెన్యూవల్ వివరాలు ఇలా..

మండలం	మొత్తం రైతులు	రెన్యూవల్ చేసుకున్న రైతులు(అంచనా)
ధర్మవరం	18,740	4,000
బత్తలపల్లి	11,779	3,000
తాడిమర్రి	13,584	4,000
ముదిగుబ్బ	18,394	3,500

సీజన్ అంతా అవకాశం ఇవ్వాలి



బ్యాంకులో వ్యవసాయ రుణాలు పొందిన రైతులు రెన్యూవల్‌కు ఒక్క రోజు గడువు పెట్టడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభం నుంచి ముగిసే వరకు గడువు ఇవ్వాలి. తద్వారా రైతులందరూ పంట రుణాలను రెన్యూవల్ చేసుకుని ప్రభుత్వం అందించే రాయితీని పొందుతారు.

–కమతం కాటమయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, బత్తలపల్లి

డబ్బుతో ఇబ్బందులు



ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు, పిల్లలను బడికి పంపేందుకు డబ్బుతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటాం. ఇదే సమయంలో పంట రుణాలు రెన్యూవల్ కూడా జరుగుతుంటాయి. ఈ ఒత్తిళ్లలో రెన్యూవల్ గడువు ఆలోచన ఉండదు. ఏడాది గడువు గురించి అవగాహన లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

–సింగమనేని సూర్యనారాయణ, రైతు, మాల్యవంతం, బత్తలపల్లి.

జూలై 15 లోపు రుణాలు పొందాలి



రైతులు జూలై 15వ తేదీలోగా రుణాలు పొందితే, బీమా పొందే అవకాశం ఉంటుంది. రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ పొందే అవకాశం ఉంటుంది. రైతులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండి, ఏడాదిలోపు బ్యాంకు రుణాలు తీర్చడానికి ప్రయత్నించాలి.

–ఓబిరెడ్డి, వ్యవసాయాధికారి, బత్తలపల్లి.

రాయితీని వినియోగించుకోవాలి



రైతులు తీసుకున్న రుణాలు సంవత్సరంలోపు చెల్లించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న వడ్డీ రాయితీని వినియోగించుకోవాలి. సంవత్సరానికి ఒక్క రోజు దాటినా ప్రభుత్వం అందజేసే రాయితీని కోల్పోతారు. దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఈ విషయాన్ని బ్యాంకు అధికారులు రైతులకు తెలియజేస్తూనే ఉన్నారు.

–సుధీర్‌కుమార్, ఏపీజీబీ రామాపురం శాఖ మేనేజర్, బత్తలపల్లి.

గొడవలు వద్దు.. ఐక్యతే ముద్దు


ముష్టికోవెలలో సోదాలు చేస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: ప్రజలందరూ గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవనం సాగించాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ముష్టికోవెల గ్రామంలో ఏపీఎస్పీ సిబ్బందితో కలసి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. అలాగే వారి ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశీలించి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామంలో అనవసరంగా గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడుతాయన్నారు. ఆ రోజు గ్రామంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రజలు సహకరించాలని సూచించారు. గొడవలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. గ్రామంలో కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రికార్డులు సరిగా లేని నాలుగు వాహనాలను సీజ్ చేశారు.

గ్రామాల్లో కార్డెన్ సెర్చ్

ఓడీచెరువు: సమస్యాత్మక గ్రామాలైన కుసుమవారిపల్లి, దిగువపల్లి, కొండకమర్లలో గురువారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో పోలీసులు క్షుణ్ణంగా సోదాలు చేపట్టారు. ఈసందర్భంగా సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ తర్వాత ఎవరూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, గుంపులుగా జనం కనబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐలు వంశీకృష్ణ, మగ్బూల్‌బాషా, రమేష్ కుమార్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొలకల పున్నమి వేడుకలు


మొలకలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు


గ్రామంలో మొలకలతో ఊరేగుతున్న చిన్నారులు

బత్తలపల్లి: అప్పరాచెరువు గ్రామంలో గురువారం గ్రామపెద్దల ఆధ్వర్యంలో మొలకల పున్నమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి నవధాన్యాలతో తమ ఇంటి ముంగిట ఐదు రోజుల క్రితం విత్తనాలను మట్టిలో పెట్టారు. అవి మొలకలు ఎత్తాయి. అనంతరం గురువారం సాయంత్రం తమ ఇంట్లోని చిన్నారులను అందంగా ముస్తాబు చేసి వారి చేతుల్లో కలశాలు ఉంచి అందులో మొలకెత్తిన మొక్కలను ఉంచి గ్రామంలో ఊరేగించారు. గ్రామంలోని ఆలయాల్లోకి వెళ్లి అక్కడ పూజలు నిర్వహించి, అక్కడ కొన్ని మొలకలను ఉంచారు. ఆ తరువాత మిగిలిన మొలకలను గ్రామ సమీపంలోని చెరువుల్లో వేశారు. ఈ విధంగా చేయడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురిసి, సాగు చేసిన పంటలు చేతికి వస్తాయని గ్రామస్తుల నమ్మకం. అనంతరం గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముదిగుబ్బ: గంగిరెడ్డిపల్లిలో గురువారం మొలకల పున్నమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని ఏటా మొలకల పున్నమి జరుపుకుంటామని గ్రామపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు తలపై మొలకలను పెట్టుకొని గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు.

21 రౌండ్లలో 'కదిరి' ఓట్ల లెక్కింపు

- ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు
- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు మరో 4 టేబుళ్లు
- కౌంటింగ్‌కు కౌన్సిలర్లకు అనుమతి లేదు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కదిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సన్నీ వంశీకృష్ణ



కదిరి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న ముగిసింది. ఈ ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుంది. కదిరి, హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో జరగనుంది. ఈ ఓట్ల లెక్కింపు ఎలా జరగనుంది? అనే అంశంపై గురువారం కదిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సన్నీ వంశీకృష్ణ తన కార్యాలయంలో 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి గౌరవవేతనం తీసుకునే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు అంటే కౌన్సిలర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు కౌంటింగ్ ఏజెంట్లుగా ఉండటానికి వీల్లేదని చెప్పారు. అలాగే క్రిమినల్ కేసులు ఉన్నవారు కూడా ఏజెంట్లుగా ఉండటానికి వీల్లేదన్నారు. ఇంకా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కౌంటింగ్‌కు సంబంధించి పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలేంటో చూద్దాం..

'సాక్షి': కదిరికి సంబంధించి ఓట్ల లెక్కింపు ఎలా జరగనుంది?

ఆర్‌ఓ: కదిరి నియోజకవర్గంలో మొత్తం 281 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఓట్ల లెక్కింపు జూన్ 4న హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో ఉంటుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తాం. ఇవి కూడా ఒక ప్రత్యేక గదిలో లెక్కిస్తారు. వీటికి 4 టేబుళ్లు ఏర్పాటు చేస్తాం. ఒక్కో రౌండ్‌కు 500 పోస్టల్ బ్యాలెట్లు చొప్పున లెక్కిస్తారు. ఇలా ఎనిమిది రౌండ్లలో వీటి లెక్కింపు పూర్తవుతుంది. ఈ ఓట్ల లెక్కింపునకు కూడా ఆయా పార్టీల ఏజెంట్లు ఒక్కో టేబుల్ దగ్గర ఒకరు ఉంటారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు దగ్గర ఒక్కో టేబుల్‌కు ఒక్కో తహసీల్దార్ పర్యవేక్షణ ఉంటుంది. ఓ వైపు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుండగా మరోవైపు రెండు వేర్వేరు గదుల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఈవీఎం ఓట్ల లెక్కింపు జరుగుతుంటుంది.

'సాక్షి': కదిరికి సంబంధించి ఓట్ల లెక్కింపు ఎన్ని రౌండ్లు ఉంటుంది?

ఆర్‌ఓ: కదిరి నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 21 రౌండ్లు ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తాం. ఒక్కో రౌండ్‌లో 14 బూత్‌లు(ఈవీఎంలు) లెక్కిస్తారు. ఫలితాలు కూడా రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు అక్కడే మీడియాకు తెలియజేస్తాం. ఇందుకోసం అక్కడే ప్రత్యేకంగా మీడియా పాయింట్ ఏర్పాటు చేస్తున్నాం. కౌంటింగ్ హాల్‌లోకి మీడియాకు అనుమతి ఉండదు. కదిరి నియోజకవర్గంలో మొత్తం 281 పోలింగ్ బూత్‌లు ఉన్నందున 20 రౌండ్లలో 280 పోలింగ్ బూత్‌ల ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. 21వ రౌండ్‌లో కేవలం ఒక పోలింగ్ బూత్ మాత్రం లెక్కింపు ఉంటుంది. దీంతో మొత్తం ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది.

'సాక్షి': కౌంటింగ్ ఏజెంట్లకు మీరిచ్చే సలహా ఏంటి?

ఆర్‌ఓ: ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ రోజు ఉదయం 6 గంటలకు కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశిస్తే మొత్తం కౌంటింగ్ పూర్తయ్యేవరకూ బయటకు వెళ్లడానికి వీలుండదు. మధ్యాహ్న భోజనానికి కూడా కౌంటింగ్ సిబ్బందితో పాటు ఏజెంట్లకు కూడా విరామం ఉండదు. వీలైనంత వరకూ బాగా ఓపిగ్గా ఉండగలమనే వారే కౌంటింగ్ ఏజెంట్లుగా హాజరైతే మంచిది. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకునే వారు కౌంటింగ్ ఏజెంట్లుగా ఉండటానికి వీల్లేదు.

'సాక్షి': కౌంటింగ్‌కు ఎంతమంది ఏజెంట్లకు అనుమతి ఉంటుంది?

ఆర్‌ఓ: ఒక్కో రాజకీయ పార్టీ తరఫున ఒక్కో టేబుల్ దగ్గర ఒక ఏజెంట్‌ను మాత్రమే కౌంటింగ్‌కు అనుమతిస్తాం. వారి వివరాలు కూడా కౌంటింగ్‌కు రెండు రోజులు ముందే మాకు తెలియజేయాలి. ఈవీఎంల లెక్కింపునకు ఒక్కో పార్టీ తరఫున ఒక టేబుల్ దగ్గర ఒక ఏజెంట్ ఉంటారు. అంటే ఒక్కో రౌండ్‌కు 14 మంది ఒక పార్టీ తరఫున ఉంటారు. వీరే చివరి రౌండ్ దాకా కొనసాగుతారు. వీరికి రిలీవర్ ఉండరు. స్వతంత్ర అభ్యర్థులకు కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి. ఎమ్మెల్యే అభ్యర్థికి ఎంతమంది ఏజెంట్లను అనుమతిస్తామో ఎంపీ అభ్యర్థి తరఫున కూడా అంతేమంది ఏజెంట్లను అనుమతిస్తాం.

'సాక్షి': ఓట్ల లెక్కింపు ఎక్కడి నుంచి మొదలవుతుంది?

ఆర్‌ఓ: తలుపుల మండలం సబ్బనగుంతపల్లి పోలింగ్ బూత్ నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభించి కదిరి రూరల్, కదిరి టౌన్, గాండ్లపెంట, ఎన్‌పీకుంట, నల్లచెరువు, చివర్లో తనకల్లు మండలంతో ముగుస్తుంది. నియోజకవర్గంలో మొత్తం 2,53,420 ఓట్లకు గాను పురుషులు 1,02,411 మంది, మహిళా ఓటర్లు 1,03,796 మంది, ఇతరులు మరో ఏడుగురు ఇలా మొత్తం కలిపి 2,06,214 మంది(81.37శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓట్ల లెక్కింపు పూర్తి కావడానికి రాత్రి కావొచ్చు.

ప్రమాదకరంగా చెట్టు


ధర్మవరం వెళ్లే రహదారిలో ఎండిన వేపచెట్టు

చెన్నేకొత్తపల్లి: ఎన్.ఎస్ గేట్ నుంచి ధర్మవరానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉప్పరవాండ్ల కొట్టాల బస్టాండ్ వద్ద ఓ వేప చెట్టు పూర్తిగా ఎండింది. ఈదురు గాలులు బలంగా వీచినప్పుడు పెద్ద కొమ్మలు విరిగి పడే అవకాశం ఉంది. ఈ రహదారిలో రోజూ వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదం జరగక ముందే ఎండిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న ప్రధాన రహదారి


గాజుల కొనుగోలులో నిమగ్నమైన మహిళలు

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


దుర్గమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో దుర్గమ్మ పరుషలో భాగంగా గురువారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ సమీపంలోని రోడ్లన్నీ రద్దీగా మారాయి. గాజులు, బొమ్మలు, ఇంటి సామగ్రి, ఇంటి అలంకరణకు ఉపయోగపడే పూలు, ఇతరత్రా వస్తువుల దుకాణాలు ప్రజలతో కిటకిటలాడాయి.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ధర్మవరం అర్బన్: సంజయ్‌నగర్‌లోని బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కోర్టు రోడ్డులోనున్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కొత్తపేటలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ గోపాల్‌నాయక్ గురువారం తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి కేంద్రంలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఒక్కో పరీక్ష కేంద్రంలో 11 మంది ఇన్విజిలేటర్లు, ఒక చీఫ్ సూపరింటెండెంట్ నియమించామని పేర్కొన్నారు.

ఓడీచెరువు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విజ్ఞాన్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు చీఫ్‌లు టి.మురళీకృష్ణ, కె.సుభహాన్, డిపార్ట్‌మెంటల్ అధికారులు రవీంద్రనాయుడు, రిజ్వానుల్లాఖాన్ తెలిపారు. పరీక్షలు నేటి నుంచి ఈనెల 31 వరకు కొనసాగుతాయన్నారు.

గీతామందిరంలో ప్రత్యేక పూజలు

నల్లచెరువు: పౌర్ణమి సందర్భంగా స్థానిక గీతామందిరంలోని వేణుగోపాల స్వామి వారికి గురువారం అర్చకులు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

ముదిగుబ్బ: సానేవారిపల్లిలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గురువారం ఎంపీడీఓ నాగశేషాచల రెడ్డి, పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరిగే ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు, పనుల వివరాలు తదితర వాటి గురించి కూలీలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా మస్టర్‌ను పరిశీలించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ రమణారెడ్డి సిబ్బంది ఉన్నారు.

బాణాసంచా విక్రయాలపై నిషేధం

ఎన్‌పీ కుంట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా బాణాసంచా విక్రయాలపై నిషేధం విధించినట్లు ఎస్‌ఐ శ్రీధర్ గురువారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయని ఇందులో భాగంగా ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులు రద్దు చేసినట్లు చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెన్నేకొత్తపల్లి: జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. మండల పరిధిలో ఎక్కడా టపాసులు ఇతర పేలుడు సామగ్రి విక్రయించొద్దని వ్యాపారులను హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు జూన్ నెల 6వ తేదీ వరకు అమలులో ఉంటాయన్నారు. మందుగుండు సామగ్రి అమ్మకం కొనుగోలు, వినియోగం నిషేధ ఉత్తర్వులను కలెక్టర్ జారీ చేశారన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సెక్షన్ 436 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న యల్లమ్మ తల్లి

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలోని యల్లమ్మ ఆలయంలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యల్లమ్మ అమ్మవారి తిరునాలలో భాగంగా తెల్లవారుఝామునే భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో చేరుకొని అమ్మవారికి గంధాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక నల్లగంగమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రమణ మహర్షి ఆశ్రమంలో పౌర్ణమి వేడుకలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోనున్న రమణ మహర్షి ఆశ్రమంలో పౌర్ణమి సందర్భంగా గురువారం భక్తులు రమణ మహర్షికి పూజలు చేశారు. అనంతరం మహా పరిపూర్ణ శాంతి యాగం నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తి పాటలు పాడారు. ఆశ్రమం నిర్వాహకులు చిప్పల వెంకప్ప భక్తులకు అన్నదానం చేశారు.

రెండు టిప్పర్ల పట్టివేత

సోమందేపల్లి : మండలంలోని వెలుగమాకులపల్లి వద్ద జాతీయ రహదారిపై కంకర తరలిస్తున్న రెండు టిప్పర్లను విజిలెన్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. పరిమితికి మించి లోడు ఉండటంతో అనంతపురం విజిలెన్స్ అధికారులు వాహనాలను సీజ్ చేశారు. పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

అన్నమయ్యకు నృత్య నీరాజనం


నృత్యం చేస్తున్న చిన్నారులు

ధర్మవరం అర్బన్: అన్నమయ్య జయంతి సందర్భంగా లలిత నాట్యకళానికేతన్ కళాకారులు అన్నమయ్య సంకీర్తనలకు నృత్యంతో నీరాజనాలర్పించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం ముందు గురువారం అన్నమయ్య విగ్రహానికి లలిత నాట్య కళానికేతన్ నాట్యాచార్యులు బాబుబాలాజీ, కమల బాలాజీ, రామలాలిత్యలతోపాటు వార్డు ఇన్‌చార్జ్ తీర్థాల రమణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 60 మంది విద్యార్థినులతో సంకీర్తనలకు భరతనాట్యం, కూచిపూడి, కోలాటం తదితర నృత్యాలు ప్రదర్శించారు.

కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్


యోగాపై శిక్షణ ఇస్తున్న సుబ్బరాయుడు

కనగానపల్లి: వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్)లో భాగంగా విద్యార్థులకు ఆటలు, యోగాలో శిక్షణ అందిస్తున్నట్లు మండల గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో యోగా విద్యపై విద్యార్థులకు యోగా గురువు సుబ్బరాయుడు శిక్షణ అందించారు. యోగాసనాలు వేయటం ద్వారా ఆరోగ్యం, శారీరధారుఢ్యత పెరుగుతుందన్నారు. అలాగే చెస్, క్యారమ్స్, స్కిప్పింగ్ వంటి ఆటలపై శిక్షణ అందించారు. వేసవిలో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా సమ్మర్ క్యాంపులకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొడవలకు దిగొద్దు


వేల్పుమడుగు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: త్వరలో సార్వత్రిక ఫలితాలు వెలువడనుండడంతో గ్రామాల్లో గొడవలకు దిగొద్దని ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రజలను హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంతోపాటు, వేల్పుమడుగు గ్రామాల్లో తమ సిబ్బందితో కలిసి ఆయన కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచాలు పేల్చడం లాంటివి చేయరాదన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జనాలు గుంపుగా చేరితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రౌడీ షీటర్లు, గత కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సోదాలలో రికార్డులు లేని ఆరు ద్విచక్రవాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా చింతమాను గంగమ్మ ఉత్సవాలు


అలంకరణలో కోటూరు చింతమాను గంగమ్మ

గాండ్లపెంట: మలమీదపల్లి పంచాయతీలోని కోటూరులో చింతమాను గంగమ్మ ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మొలకల పున్నమిని పురస్కరించుకుని తెల్లవారుజామునే మహిళలు ప్రతి ఇంటి నుంచి బోనాలు, జ్యోతులతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. రాత్రి భక్తులు ఎడ్లబండ్లను అలంకరించుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.

సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడి మృతి


ప్రతాప్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం గోకివారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మారాల సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు మిద్దె ప్రతాప్‌రెడ్డి(50) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ గోవిందరెడ్డి గ్రామానికి చేరుకుని ప్రతాప్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రతాప్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేమని వారు పేర్కొన్నారు. మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, మారాల సొసైటీ మాజీ అధ్యక్షుడు విజయారెడ్డి, మాజీ ఎంపీటీసీ రంగారెడ్డి, మిద్దె భాస్కర్‌రెడ్డి, చింతల్‌రెడ్డి, కేశవరెడ్డి ఉన్నారు.